క్లుప్తంగా

పింఛన్ పత్రాలు పంపిణీ

పొన్నూరు: పురపాలక సంఘ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛను మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని పత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణ పరిధిలో 119 మందికి పింఛను మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభోత్సవం

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బి.రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి పీఎం కిసాన్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వరి, పత్తి, వేరుశనగ, మిరప, పచ్చిశనగ వంటి పలు పంటలు పండిస్తున్నారని, ఆయా పంటల సాగుకు పెట్టుబడికి రూ. 35,000 నుంచి రూ. 50 వేల వరకు రైతులకు ఖర్చవుతుందన్నారు. ఆ పెట్టుబడిలో రూ 20 వేలను రైతులకు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పీఎం కిసాన్ నిధి చెక్కును రైతులకు అందించారు. కార్యక్రమంలో అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, అడిషనల్ జనరల్ మేనేజర్ అజిత్‌వర్మ, వీసీలు డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి దేవి, ఎస్వీవీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జేపీ రమణ, కలెక్టర్ నాగలక్ష్మి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. యుగంధర్ కుమార్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన కారు
- మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం



చేబ్రోలు: అతివేగంగా వచ్చిన కారు ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. చేబ్రోలు మండలం నారాకోడూరు తెనాలి రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రాత్రి సమయంలో కారు బలంగా ఢీ కొట్టి పల్టీలు కొట్టింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్ క్రిందకు వాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. సమీపంలోని ఇంటి ప్రాంగణం వద్ద జరిగింది. పగలు జరిగి ఉంటే రాకపోకలు సాగించే వారు అధిక సంఖ్యలో ఉండేవారు. వడ్లమూడిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు కారులో గుంటూరు నుంచి వడ్లమూడికి బయలు దేరి మార్గ మధ్యలో నారాకోడూరు వద్ద ప్రమాదానికి గురయ్యారు. ప్రమాద సమయంలో కారులో నలుగురు ఉన్నప్పటికీ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన విద్యుత్ లైన్ కావటంతో గుండవరం, గొడవర్రు, నారాకోడూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు గ్రామాలకు శనివారం ఉదయం సరఫరాను పునరుద్ధరించారు. నారాకోడూరు గ్రామంలోని ప్రమాద సంఘటన జరిగిన ప్రాంతంలో ఆలస్యంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అలరించిన సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం డాక్టర్ ద్వారం లక్ష్మి శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. శ్రీదాస సాహిత్య ప్రాజెక్ట్, టీటీడీ, శ్రీకంచి కామకోటిపీఠ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం (గుంటూరు), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫైర్ ది ఆర్ట్స్ రీజనల్ సెంటర్ (తిరుపతి), ద్వారం లక్ష్మి అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ (తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ పాలక మండలి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నారాయణ తీర్థులు ప్రబోధించిన నమ సంప్రయోగ వైభవాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ డీవి నరసింహదీక్షితులు వివరించారు. అనంతరం దీక్షితులను సత్కరించారు. డాక్టర్ లక్ష్మి అన్నమయ్య, పురందరదాసు, రామదాసు, వెంకట సుబ్బాయర్ వాగ్గేయకారుల రచనలు, రాగం, తానం, పల్లవి గానం చేశారు. వయోలిపై పెరవలి నందకుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై శ్రీహరిబాబు వాయిద్యం అందించారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- కూటమి ప్రభుత్వ పాలనపై అంబటి మురళీకృష్ణ ధ్వజం
- పొన్నూరు మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ
- చంద్రబాబు మోసాలపై భగ్గుమంటున్న ప్రజలు



తాళ్లపాలెంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా జనాన్ని పదేపదే మోసాలు చేయడంలో చంద్రబాబు ఘనత సాధించారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. శనివారం పొన్నూరు మండలంలోని తాళ్లపాలెం, ఆరెమండ, గాయంవారిపాలెం, దండమూడి గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అంబటి మురళీకృష్ణ పాల్గొని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. మహిళలు తమకెలాంటి పథకాలు కూటమి ప్రభుత్వంలో రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హామీలతో ప్రకటించిన మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించి ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు.

–ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పొన్నూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని అన్నారు. ప్రజలకు కావలసిన మౌలిక వసతులను కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇప్పటికీ గ్రామీణ ప్రజలు నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. చెరువుల అభివృద్ధి పేరుతో మట్టి విక్రయాలతో సొంత ఖజానా నింపుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వైద్యసేవలు అందించడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్యసేవలు అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, పేదల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటికే చేరువ చేసిన జననేత వైఎస్ జగన్ అన్నారు. కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను ఆపలేరన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, సర్పంచులు చుండూరు వీరయ్య, తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మహిళా విభా గం అధ్యక్షురాలు కె.మరియా రాణి, ఎస్సీసెల్ అధ్యక్షులు పొనుగుపాటి పాల్ రాజ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్. మౌలాలి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ప్రవీణ్, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఎస్. రవీంద్ర బాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పెన్షనర్స్, ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, నాయకులు లంక పోతు పిచ్చిరెడ్డి, షేక్.నాజర్, అమిరినేని సాంబశివరావు, దేవరకొండ గోపి, మూర్తిరాజు, అంబటి వెంకటేశ్వరావు, దాసరి శ్రీనివాస రావు, రమేష్, న్యాయవాది నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన స్థానికులు

నేడు రెండు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

పెదకాకాని: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పై ప్రజలకు తెలియజేసేందుకు పెదకాకాని మండలంలోని నంబూరు, అగతవరప్పాడు గ్రామాల్లో ఆదివారం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముడియాల మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొంటారు. సాయత్రం 6 గంటలకు నంబూరు ముస్లింపాలెం, 6:30 గంటలకు విజయ భాస్కర్‌నగర్, 7 గంటలకు అంబేద్కర్ నగర్‌లో జరుగుతుందన్నారు. అలానే రాత్రి 8 గంటలకు అగతవరప్పాడు గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని శనివారం ఒక ప్రకటన ద్వారా మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి కోరారు.

నూతన పింఛన్లు పంపిణీ

చేబ్రోలు: మండలంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను శనివారం పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన 192మంది లబ్ధిదారులకు వితంతు పెన్షన్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైలా రామరాజు, చందు శ్రీరాములు, వీరంకి రంగారావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలతో నవజాత శిశువులకు ఆరోగ్యం



గొట్టిపాడులో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మాధవి



చినకోండ్రుపాడులో తల్లిపాల ఆవశ్యకతపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్. భారతి

ప్రత్తిపాడు: తల్లిపాలతో నవజాత శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్. భారతి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం ప్రత్తిపాడు సెక్టారులోని చినకోండ్రుపాడులో, గొట్టిపాడు సెక్టారులోని గొట్టిపాడులో నవజాత శిశువుల సంరక్షణ, తల్లిపాలు ఇచ్చే పద్ధతులపై తల్లులు, బాలింతలు, గర్భవతులకు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్. భారతి, పి.మాధవిలు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుంచి 28 రోజుల వరకు నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వారికి పాలు ఇచ్చే సమయంలో తల్లులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. సిజేరియన్ కాన్పు అయిన తల్లి పోషకాహారాన్ని తీసుకుంటూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. తల్లిలో పాల ఉత్పత్తి బిడ్డలకు సరిపోయేంత ఉండాలంటే ఆహారంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పి. స్రవంతి, ఏఎన్ఎం పి. పరమేశ్వరి, ఎన్. కోటమ్మ పాల్గొన్నారు.

లాలుపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

గుంటూరు రూరల్: తల్లిపాలు చిన్నారులకు ఆరోగ్యవనరని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వెంకటరత్నం తెలిపారు. శనివారం మండలంలోని లాలుపురం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన ప్రతి చిన్నారికి తల్లిపాలను అందించటం వల్ల తల్లికి బిడ్డకు మంచి ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె. భారతి, బి.సాయిదుర్గ, పి.రామలక్ష్మి, ఆశవర్కర్లు ప్రమీల, బాలింతలు, గర్భిణులు తదితరులు పెద్దలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న వెంకటరత్నం

వెనిగండ్లలో తాగునీటి సరఫరా అధ్వానం

- గ్రామంలో అడుగంటిన మంచినీటి చెరువు
- రంగుమారి, నీరు వాసన వస్తున్నా పట్టించుకోని అధికారులు
- నాలుగేళ్లుగా రెండు రోజులకొకసారి నీటిసరఫరా
- నత్తనడకన మరమ్మతు పనులు



అడుగంటిన మంచినీటి చెరువులు

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామంలో సరఫరా అవుతున్న నీరు అధ్వానంగా మారింది. చెరువు అడుగంటడంతో నెలరోజులుగా గ్రామంలోకి రంగుమారి, వాసన వస్తున్న నీరే సరఫరా అవుతోంది. అయినా అధికారులు సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకో లేదు. నాలుగేళ్లుగా రెండు రోజులకు ఒకరోజు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దీనిపై అధికారులకు ముందుచూపులేపోవడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వల్ల చెరువుకు నీరు పెట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో గ్రామంలోకి ఉప్పునీరు, రంగుమారిన నీటి సరఫరా అవుతోంది. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ పథకం నిర్వహణలో గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా రెండు ఫిల్టర్ బెడ్‌లు, ఒక మైక్రో ఫిల్టర్, రెండు వాటర్ ట్యాంక్, చెరువుకు నీరు పంపింగ్ చేసేందుకు నూతనంగా కొనుగోలు చేసిన మోటార్‌లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు వేసవి కాలంలో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెరువుకు దూరంగా రెండు బోర్లు ఏర్పాటు చేశారు. చెరువు నుంచి ఫిల్టర్ బెడ్లకు చేరి ఫిల్టర్ అవుతున్న నీటిలో బోర్ల ద్వారా వచ్చే నీటిని కలిపి గ్రామంలో సరఫరా చేస్తున్నారు. బోరు పంపుల నీరు ఉప్పగా ఉండటం వలన గ్రామ ప్రజలు కూడా ఆ ఉప్పు నీరే తాగాల్సి వస్తుంది. మొత్తం 1850 కుళాయిలు ఉండగా 12 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి.

నత్తనడకన మరమ్మతులు

వెనిగండ్ల రక్షిత మంచినీటి పథకం నిర్వహణలో చోటు చేసుకుంటున్న మరమ్మతులు గంటల వ్యవధిలో జరిగే పనులు కూడా రోజులు పడుతున్నాయి. రెండు ఎయిర్ వాల్స్ బిగించడానికి 15 రోజులు పట్టిందంటేనే పనులు ఎంత నిర్లక్ష్యంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. గుంటూరు చానల్ (కొత్తకాలువ)కు నీరు చేరి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్కచుక్క నీరు కూడా మంచినీటి చెరువుకు చేరలేదు. చెరువులు అడుగంటడంతో ఉన్న నీరు చిక్కగా ఉండటంతో పాటు వాసన కూడా వస్తున్నాయి. జల్లెడతో వడకట్టినా బిందెల అడుగున మట్టి పేరుకుపోతోందని, వాసన వస్తుందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మైక్రోఫిల్టర్ ద్వారా ఫిల్టర్ అయిన నీరు, ఫిల్టర్ బెడ్ ద్వారా ఫిల్టర్ కాని నీరు కలిపి గ్రామంలోకి సరఫరా చేస్తున్నారు. ఒక రోజు నీటిలో బ్లీచింగ్ కలిపితే 15 రోజుల పాటు కలిపే పరిస్థితి కనిపించదు. ఎప్పుడు చూసినా పైపులైన్ల మరమ్మతులే. ఈ పేరుతో తరచూ నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. నిరుపేద కుటుంబాలు తరచూ మినరల్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి డబ్బులు చెల్లించి తాగునీరు కొనుగోలు చేసుందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా ఫిల్టర్ అయిన నీటిని సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



వాటర్ స్కీంలో ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్



వెనిగండ్లలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్‌లు



గుంటూరు చానల్ నుంచి చెరువుకు నీరు పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన పైపు కనెక్షన్

రక్తదానంతో ఎందరికో ప్రాణదానం

కిట్స్ కళాశాల సెక్రటరీ కోయి శేఖర్



రక్తదానం చేసిన విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న కళాశాల సెక్రటరీ కోయి శేఖర్

ప్రత్తిపాడు: రక్తదానంతో ఆపదలో ఉన్న ఎందరికో ప్రాణదానం చేయవచ్చని కిట్స్ కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, నీడ్స్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలలో ఆయా విభాగాలకు చెందిన 155 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోయి శేఖర్ మాట్లాడుతూ ఒకరి రక్తదానంతో ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చని, అందుచేత యువత రక్తదానంలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని ముందుకు అడుగులు వేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబులు మాట్లాడుతూ రక్తదానం వలన ఏవిధమైన అనర్థాలు ఉండవని, విద్యార్థులు రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం

వట్టిచెరుకూరు సీఐ ఎం. రమానాయక్



మాట్లాడుతున్న సీఐ రమా నాయక్, వేదికపై కళాశాల చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని వట్టిచెరుకూరు సీఐ ఎం.రమానాయక్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం డ్రగ్స్ వలన ఎదురయ్యే ఇబ్బందులపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వాడటం వలన జీవితాలు, కుటుంబాలు ఏ విధంగా నాశనం అయిపోతాయి.. అన్న అంశాలను వీడియో ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఐ రమానాయక్ మాట్లాడుతూ సురక్షితమైన వాతావరణంలో విద్యార్థులు చదువు కొనసాగిస్తూ, బాధ్యతయుతమైన పౌరులుగా నడుచుకోవాలని చెప్పారు. భావిభారతాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర అవసరమని సూచించారు. మాదకద్రవ్యాల వైపు విద్యార్థులు మొగ్గ చూపకుండా ఉండేలా, వాళ్లను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, డ్రగ్స్ కమిటీలపై ఉందని స్పష్టం చేశారు. డ్రగ్స్, గంజాయి, పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావద్దన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పోలీసు శాఖ చేస్తున్న ప్రయత్నానికి మనమంతా సహకరిద్దామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

కీటకనాశనుల వినియోగంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న రైతులు శాస్త్రవేత్తలతో హిల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: భారత ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ఆదేశాలమేరకు శనివారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో కీటకనాశకాలు సురక్షితంగా, వివేకవంతంగా ఉపయోగించడం అనే అంశంపై హిల్స్ ఇండియాలిమిటెడ్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ వై.సతీష్ పురుగు మందులు వినియోగంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎన్వీస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అనేక రకాల పురుగు మందులు ఏఏ పంటలకు ఎంతమోతాదులో వినియోగించాలి వివరించారు. హిల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి అజిత్ వర్మా కార్యక్రమంలో పాల్గొన్న రైతులందరికీ భద్రతా కిట్‌లు అందచేసారు. కిట్‌లలో కళ్ళజోడు, మొఖానికి మాస్క్, చేతులకు గ్లవ్స్, యాప్రాన్, కాళ్ళకు బూట్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో లాంఫాం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గోపాలస్వామి, రాజేస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లం కళాశాలలో ఇంజినీరింగ్ స్నాతకోత్సవం



డిగ్రీ పట్టాలను పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో 2025వ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాలను ప్రదానం, స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యా విధానాలు విద్యార్థులకు అందజేస్తామన్నారు. జెఎన్‌టీయూ కాకినాడ విశ్వ విద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ వి.సుబ్బారావు చేతులమీదుగా విద్యార్థులకు 2025వ విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన 600 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల నుంచి స్వయం ప్రతిపత్తి హోదా పొందిన తర్వాత ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా పొందిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన 11 సంవత్సరాలలో ప్రముఖ విద్యా ప్రమాణాలు కలిగిన ఎన్‌బిఎ, నాక్- ఏ గ్రేడు గుర్తింపు, స్వయం ప్రతపత్తిని సాధించడంతో పాటు 2025 వ విద్యా సంవత్సరంలో డిగ్రీ పట్టా ప్రదానోత్సవ స్నాతకోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీయస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత ఉద్యోగాలతో ఉజ్వల భవిష్యత్తు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ షణ్ముఖ రావు, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ సన్నీడియోల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్లం నవ్య, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పియల్ మాధవరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విగ్గీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం: స్విగ్గి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు కోరారు. గుంటూరు లాడ్జిసెంటర్‌లో స్విగ్గీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పే-ఔట్ విధానానికి కొత్త విధానానికి సగానికి సగం వేతనం కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇన్సెంటివులు రద్దు చేశారని, అనారోగ్యం, బంధువులు మరణించినా ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులు రెండు రోజులు డ్యూటీ ఆఫ్ అయితే వారి ఐడీలు బ్లాక్ చేస్తున్నారని అన్నారు. డ్యూటీ ఆఫ్ అయితే ఎలాంటి వేతనం చెల్లించని సంస్థ వారి ఐడీలు బ్లాక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంస్థ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అందువలన మూడు రోజులుగా స్విగ్గీ కార్మికుల సమ్మె చేస్తున్నారన్నారు.

• హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి

గుంటూరు మెడికల్: పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి చేయాలని, దీనికి ప్రత్యేకంగా ఒక చట్టం తీసుకొని రావాలని నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ అన్నారు. ప్రధాన మంత్రి దీనిపై దృష్టి సారించాలని విలేకరుల సమావేశంలో కోరారు.